







ఆ 47 ఎకరాలు ఏమైనట్టో?

చెన్నకేశవస్వామి ఆలయ భూములు

చెన్నకేశవ స్వామి

ధర్మవరం చెన్నకేశవస్వామి ఆలయం

విజయనగరం

రాజుల కాలంలో ధర్మవరంలో నిర్మిత మైన చెన్నకేశవస్వామి ఆలయం అంటే ఎస్.కోట చుట్టుపక్కల ప్రాంతాల్లో తెలియని వారుండరు. ఈ ఆలయానికి ఎంతో వైభవం ఉండేది. ఆలయ నిర్వహణకు అప్పట్లో రాజులు 141 ఎకరాలు ఇచ్చారు. వాటిపై వచ్చే ఆదాయంతో స్వామికి ధూపదీప నైవేద్యాలు.. అభిషేకాలు.. యజ్ఞాలు.. పురోహితులకు వేతనాలు దక్కేవి. కాలక్రమంలో స్వామికే దయనీయ పరిస్థితి తలెత్తింది. ఆలయ భూములను వివాదాలు చుట్టుముట్టాయి. కోర్టు కేసుల్లో 53 ఎకరాలుంది. 47 ఎకరాల సంగతేంటో అంతు చిక్కడం లేదు. ఎవరెవరి ఆక్రమణలో ఉన్నాయో అధికారులు తేల్చడం లేదు. ఆఖరికి అంత పేరున్న ఆలయంలో అర్చకులకు ఐదేళ్లుగా వేతనాలు అందడం లేదు.

- చెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో ఆక్రమణలు
- దశాబ్దకాలంగా కానరాని రికార్డులు
- కోర్టులో మరో 53 ఎకరాల వివాదం
- 41 ఎకరాలకే శిస్తు వసూలు
- అర్చకులకు ఐదేళ్లుగా అందని వేతనాలు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం చెన్నకేశవస్వామి మహిమ కలవారని భావించి ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి అప్పట్లో ఎడ్లబళ్లపై వచ్చి స్వామిని దర్శించుకొని పూజలు చేసుకునేవారు. ప్రత్యేక రోజుల్లో ఆలయం భక్తులతో కోలాహలంగా ఉండేది.

ఆదాయం రావడంతో స్వామికి అన్ని రకాల కైంకర్యాలు వైభవోపేతంగా సాగేవి. ధర్మవరం గ్రామంలో నిత్యం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేది. కాలక్రమంలో ఆ కళ తప్పింది. దశాబ్దాల కిందట కొంత ఆలయ భూమిని విశాఖ జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు చౌక ధరకు చేజిక్కించుకున్నారు. ఇంకొన్ని భూములు ఆక్రమణల్లో ఉన్నాయి. అయితే దశాబ్దం క్రితం ఈ ఆలయ భూములపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. అప్పట్లో దేవదాయశాఖ స్పందించి ప్రత్యేకంగా సర్వే చేయించి 41 ఎకరాలు గుర్తించింది. ప్రస్తుతం ఈ భూముల నుంచి మాత్రమే ఎకరం వద్ద రూ.1500 చొప్పున శిస్తు వసూలవుతోంది. కాగా 53 ఎకరాలకు సంబంధించి ఆయా వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో ఆ భూమి కేసుల్లో ఉండిపోయింది. అప్పట్లో 41 ఎకరాలను గుర్తించిన దేవదాయశాఖ వివాదం లేని మిగతా 47 ఎకరాల సంగతి తేల్చలేదు. రాజకీయ ఒత్తిడితో వదిలేశారన్న విమర్శ ఉంది. ఆ తర్వాత ఆ భూముల రికార్డులను మార్చేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడకు వచ్చే ఈవోలు సన్యాసేశ్వర స్వామి ఆలయ ఆదాయం, ఖర్చులపై శ్రద్ధ పెడుతున్నారు కానీ చెన్నకేశవస్వామి ఆలయ భూములను గుర్తించే ప్రయత్నం చేయడం లేదు.

పరుల చేతిలో 53 ఎకరాలు..

స్వామివారికి చెందిన 141 ఎకరాల్లో కొంతమంది వ్యక్తులు ఈ భూములు తమవని, అర్చకుల దగ్గర కొన్నామని చెబుతూ హైకోర్టును ఆశ్రయించారు. సుమారు 20ఏళ్లుగా ఈకథ నడుస్తోంది. అసలు దేవదాయశాఖ భూములు ఎలా కొంటారు.. ఎవరు అమ్ముతారు అనేది దేవదాయశాఖ అధికారులే తేల్చాలి. ఇదిలా ఉండగా ఆంధ్రజ్యోతి కథనాలతో (మిగతా 8వ పేజీలో..)

ఆ భవనాల్లో భద్రత ఉందా?



విజయనగరంలోని ఓ ప్రైవేటు కళాశాల భవనం

- ఇరుకు గదుల్లో ఇంటర్ తరగతులు
- మొక్కుబడిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలు
- కనీస నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు
- అడ్డగోలుగా అనుమతులు
- అధికారుల తీరుపై విమర్శలు

విజయనగరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వందకుపైగా కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. చాలావాటికి అనుమతుల విషయంలో అనేక అనుమానాలున్నాయి. భవన నిర్మాణాల నుంచి విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల వరకు అన్నింటా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస నిబంధనలు పాటించకపోయినా అధికారులు సమగ్రంగా పరిశీలించకుండా అనుమతులు ఇచ్చేశారు. ఇటీవల విద్యాసంస్థల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అయినా సరే యంత్రాంగం తీరులో మార్పులు రావడం లేదు. వాస్తవానికి (మిగతా 8వ పేజీలో..)

- జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో అనేక ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్నాయి. అగ్గిపెట్టెల్లాంటి అద్దె భవనాల్లో ఇరుకు ఇరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాలకు వెళ్లే దారి కూడా ఇరుగ్గా ఉంటోంది. ఆట మైదానాలు అన్నిచోట్లా లేవు. ఉన్నా కొద్ది స్థలమే.
- విజయనగరంలోని తోటపాలెంలో ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీ కూడా చాలా తక్కువ స్థలంలో ఉంది. తరగతి గదుల్లోకి గాలి కూడా రావడం కష్టమేమో అనేలా కనిపిస్తున్నాయి. కేవలం వ్యాపార ప్రయోజనాలను ఆశించి ఇక్కడ కళాశాలను నిర్వహిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయకుండా అనుమతులు ఇచ్చేశారు.
- తోటపాలెంలోని ఓ భవనానికి అనుమతి లేదని నగరపాలక సంస్థ అధికారులు కొంతమేర కూల్చేశారు. అంతలో ఏమైందోకానీ.. రెండు నెలల్లో తిరిగి ఆ భవన నిర్మాణం పూర్తి చేసి ఓ విద్యా సంస్థకు లీజుకు ఇచ్చేశారు. నిర్మాణంలో నిబంధనలు పాటించని భవనంలో ఏకంగా విద్యా సంస్థ నడుస్తోంది.

2.86 లక్షల టన్నుల ఇసుక సిద్ధం

- వచ్చే మూడు నెలల్లో నిరంతరాయంగా సరఫరా
- కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మాణ రంగ అవసరాల కోసం 2.86 లక్షల టన్నుల ఇసుక సిద్ధంగా ఉందని, వచ్చే మూడు నెలల్లో నిరంతరాయంగా సరఫరా చేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ప్రభుత్వ గృహనిర్మాణ పథకాల కింద చేపట్టే ఇళ్ల నిర్మాణాలు, ప్రజావసరాల కోసం, ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల భవన నిర్మాణాల కోసం ఇసుక సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక సరఫరా కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగింది. జిల్లాలో ప్రస్తుతం వివిధ ఇసుక రీచ్‌ల వద్ద అందుబాటులో ఉన్న ఇసుక, డిపోల వద్ద లభ్యత, కొత్త రీచ్‌ల అనుమతి వంటి అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కె.వెంకటాపురం ఇసుక రీచ్ ద్వారా 89 వేల టన్నులు అందుబాటులో ఉందని, రేగిడి మండలంలోని బొడ్డవలస, శ్రీకాకుళం జిల్లా తోటపాలెం వద్ద, మేడపర్తిలో మరో రెండు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని, పది రోజుల్లో అవసరమైన పర్యావరణ అనుమతులు పొంది ఈ రెండు పాయింట్ల ద్వారా మరో 1.97 లక్షల టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలకు 10 వేల టన్నుల ఇసుకను సరఫరా చేయాలన్నారు. డెంకాడ, కొత్తవలస, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఇసుక డిపోల్లో ఒక్కో చోట 50 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరాకు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్; ఏఎస్‌సి సౌమ్యలత, ఆర్‌డీవో కీర్తి, జిల్లా గనులు శాఖ అధికారి మోహనరావు, ఉప కమిషనర్ మణికుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్



విపత్తుల వేళ...

అది భోగాపురం మండలం చేపలకంచేరు పాఠశాల. అక్కడకు ఉన్నఫలంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు బుధవారం వచ్చాయి. భూకంపం వస్తోందంటూ ప్రకటించాయి. పాఠశాల పిల్లలంతా కలవరపడ్డారు. దళాలు వెంటవెంటనే రంగంలోకి దిగి విద్యార్థులను కాపాడటం ప్రారంభించాయి. పైన ఉన్నవారిని కిందకు దించాయి. కొందరిని అక్కడే ఉన్న వైద్య బృందం వద్దకు తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందించాయి. ఇదంతా చూసిన స్థానికులు ఏం జరుగుతోందని అడగ్గా విపత్తులు వస్తే ఎలా కాపాడుకోవాలో తెలియజేస్తూ మాక్‌డ్రిల్ చేశామంటూ అధికారులు చెప్పుకొచ్చారు. విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆర్‌ఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఈ కార్యక్రమం చేపట్టాయి.

విపత్తులవేళ స్వీయ రక్షణే కీలకం
- డీపీఎం రాజేశ్వరి
8

24 గంటలూ వైద్యం అందుతోందా?

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగుపడని సేవలు
- పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండని వైద్యులు, సిబ్బంది
- కుక్కకాటుకూ మందు ఇవ్వని వైనం

వసతులు మెరుగుపరుస్తాం

పీహెచ్‌సీల్లో వసతులు మెరుగుపరుస్తున్నాం. 24 గంటలూ వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నాం. నిబంధనలు, సమయ పాలన పాటించని వైద్య ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు సైతం అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రజలు వినియోగించుకోవాలి.

- జీవనరాణి, డీఎంహెచ్‌వో

రాజాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): "జిల్లాలో వైద్య ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టండి. ఎక్కడా సీజనల్ వ్యాధులు, డయేరియా వంటి మాట వినిపించకూడదు. గుర్ల డయేరియా ఘటన దృష్ట్యా మరోసారి అటువంటి వాటికి అవకాశం ఇవ్వద్దు" సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగానికి చేసిన హెచ్చరికలు ఇవి. జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అలాగే ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల పనితీరు మెరుగుపడడం లేదు. ఇప్పటికీ చాలా ఆస్పత్రులకు సాయంత్రం 5 గంటలు దాటితే తాళాలు పడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది సరిగా అందుబాటులో ఉండడం లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో 24 గంటలూ వైద్యసేవలందుతున్నాయి. 80 వరకూ పీహెచ్‌సీలు కొనసాగుతున్నాయి. ఇందులో 53 పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్టు అధికారులు చెబుతున్నారు కానీ చాలావరకూ ఆస్పత్రులు 24 గంటలు కాదు కదా..12 గంటలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. సాయంత్రం ఐదు గంటలు దాటిన తరువాత ఆస్పత్రులకు తాళాలు పడుతున్నాయి. రేగిడి మండలం బూరాడ, వంగర మండలం (మిగతా 8వ పేజీలో..)



విద్యుత్ పథకాలు శతశాతం అమలు కావాలి

- సూర్యఘర్ పథకాన్ని ఉపయోగించుకోండి
- డీఈసీ చైర్మన్, ఎంపీ కలిశెట్టి



కలెక్టరేట్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ జిల్లాలో శతశాతం అమలు చేసే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని పార్లమెంటు సభ్యుడు, జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పథకాల అమలు, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలు పటిష్టం చేసే లక్ష్యంతో నేతలు, అధికారుల సమన్వయం కోసం జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ ఏర్పాటైంది. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చైర్మన్‌గా, మరో ఎంపీ శ్రీభరత్ సహాధ్యక్షుడుగా జిల్లాకు చెందిన శాసన సభ్యులు, జడ్పీ చైర్మన్ సభ్యులుగా నియమిస్తూ కమిటీ ఏర్పాటైంది. మొదటి సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో పీఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో పెద్ద చెరువులు ఉన్నచోట వాటి గట్లపై సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేయాలన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు ముందుగా తమ గ్రామాలను సంపూర్ణ సౌర గ్రామాలుగా రూపొందించం ద్వారా ఇతర గ్రామాలకు ప్రేరణ ఇవ్వాలని సూచించారు. కమిటీ సమావేశంలో మంత్రి శ్రీనివాస్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో నెలకు కనీసం మూడు వేల యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సంస్థ ఎస్ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలో పీఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ ఫీడర్లకు సౌర విద్యుత్ సరఫరాతో అనుసంధానం చేసేందుకు, సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటుకు భూములు గుర్తించామని తెలిపారు.

7
పెళ్లి ఇష్టం లేక..
- పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఎస్ఐపై దాడి కేసులో యువకుడి అరెస్టు
- నిందితుడికి 14 రోజుల రిమాండ్: సీఐ

జిందాల్‌లో కార్మికులు విధుల బహిష్కరణ
- నిలిచిపోయిన ఉత్పత్తి

తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలి: కలెక్టర్



సీఎంతో మాట్లాడుతున్న బంగార్రాజు

ముఖ్యమంత్రి దృష్టికి కార్యకర్తల సమస్యలు

భోగాపురం, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్టు మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. సీఎంవోలో మంగళవారం రాత్రి సీఎం చంద్రబాబును కలిశానన్నారు. కార్యకర్తల సమస్యలను వివరించానన్నారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. న్యాయపరమైన సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారని కర్రోతు తెలిపారు.

నేడు ప్రజాదర్బార్

లక్కవరపుకోట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం ఎల్.కోటలోని నివాసంలో ఎమ్మెల్యే లలితకుమారి ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశం కానున్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లు రద్దు చేయండి



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన వక్ఫ్ బోర్డు బిల్లును తక్షణమే రద్దు చేయాలని ముస్లిం సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం ముస్లిం సంఘాల నేతలు నగరంలోని అంబటి సత్తర్వు జంక్షన్ నుంచి కాంప్లెక్స్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సంఘాల నేతలు ఇక్బాల్, నిజాం, ముస్తాఫా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింలపై కక్షపూరిత వైఖరిని అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు రద్దు చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల నేతలు అన్సారీ, ఆబీబ్ తదితరులు పాల్గొన్నారు.

గరివిడిలో జేసీ పర్యటన

గరివిడి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సాయంత్రం జేసీ సేతు మాధవన్ పర్యటించారు. రైల్వే మూడో లైను కోసం రైల్వే స్థలం ఎంతవరకు ఉందనే దానిపై మండలంలోని గరివిడి, దువ్వాం, తోండ్రంగి, కొండశంబం, చుక్కవలస, కేఎల్ పురం గ్రామాల్లో పర్యటించారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సర్వేయరు పాల్గొన్నారు.

'బీజేపీకి కాంగ్రెస్ భయం'

రాజాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి కాంగ్రెస్ అంటే భయం పట్టుకుందని దేశంలో ఆ పార్టీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. అందుకే సీబీఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుకుంటోందని ఆరోపించారు. ప్రతిపక్షంపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అగ్ర నాయకత్వాన్ని అణగదొక్కడానికి చూస్తోందన్నారు. అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జ్‌షీట్ దాఖలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వైసీపీకి సర్పంచ్ రాజీనామా

డెంకాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదువలస గ్రామానికి చెందిన వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి, మోదువలస సర్పంచ్ కనకల రామారావు ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలందించినా, తనకు అధిష్ఠానం గుర్తింపు ఇవ్వలేదనే ఉద్దేశంతో పార్టీని వీడినట్లు తెలిపారు.

కొట్యాడలో మన ఊరు-మన బడి

లక్కవరపుకోట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్యాడలో జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్ఎం గుమ్మడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రులను కలిశారు. మన ఊరి విద్యార్థులను మన పాఠశాలలోనే చదవించాలని కోరారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దుతామని తల్లిదండ్రులకు చెప్పారు. కార్యక్రమంలో బి.నారాయణరావు, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

డెంకాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల జరుగుతున్న నేపథ్యంలో గురువారం మండలంలోని మోపాడ, జగన్నాథపురం, వల్లూరు, మోదవలస గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కందుకూరి పురస్కారాల ప్రదానం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాకు చెందిన ఎనిమిది మంది కళాకారులకు రాష్ట్ర స్థాయి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారాలను ప్రభుత్వం ప్రదానం చేసింది. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ కళాకారులను సన్మానించి పురస్కారం అందజేశారు. 2018లో చివరిసారిగా కందుకూరి వీరేశలింగం పేరిట పురస్కారాలు ఇచ్చారు. ఏడేళ్ల విరామం తరువాత మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రదానం చేసింది.



మంత్రి కందుల దుర్గేష్ నుంచి పురస్కారం అందుకుంటున్న బత్తుల లక్ష్మి, డి.మురళీధర్, దాసరి తిరుపతినాయుడు, జి.పైడిరాజు



పురస్కారం అందుకుంటున్న కేఎస్ఎన్ చారిబాబు, కేవీ పద్మావతి, మీగడ మల్లికార్జున్, వేముల త్రినాథరావు

లలితను అభినందించిన లోకేశ్



మంత్రి లోకేశ్‌తో లలిత

నెల్లిమర్ల, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో బైపీసీ గ్రూపులో 1000 మార్కులకుగాను 989 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాల విద్యార్థుల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బర్ల లలితను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ 2025 కార్యక్రమంలో లలితను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమురాలిగా నిలిచిన లలితను, కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, అధ్యాపకులను ఆయన అభినందించారు.

జిందాల్‌లో కార్మికులు విధుల బహిష్కరణ

కొత్తవలస, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగారంలో కార్మికులు బుధవారం మూడు షిఫ్టుల్లోనూ విధులను బహిష్కరించారు. దాంతో కర్మాగారంలో ఉత్పత్తి నిలిచిపోయింది. కర్మాగారంలో 250 మంది వరకు కాంట్రాక్టు కార్మికులు, 70 మంది వరకు రెగ్యులర్ కార్మికులు, మరో 100 మంది ఇతర కార్మికులు ప్రతిరోజు విధులు నిర్వహిస్తుంటారు. కొన్ని నెలల కిందటే యాజమాన్యం కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తి వేసి ఉత్పత్తిని ప్రారంభించింది. ప్రస్తుతం కర్మాగారంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌కు సంబంధించి సిలికాన్ మాంగనీస్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. కర్మాగారంలో తయారైన మెటీరియల్ కొద్ది రోజులుగా ఎగుమతి కావడమే తప్ప ముడిసరుకు రావడం లేదని కార్మికుల్లో ఆందోళన మొదలైంది. కర్మాగారంలో ఉత్పత్తిని పూర్తిగా తరలించిన తరువాత యాజమాన్యం కర్మాగారాన్ని మూసేయ వచ్చుననే అనుమానం కార్మికులలో మొదలైంది. గతంలో కూడా ఇలానే యాజమాన్యం వ్యవహరించిందనే అనుమానంతో కార్మికులు ఆకస్మికంగా విధులు బహిష్కరించారు. ఇదిలా ఉండగా కర్మాగారంలో ఫర్నేసులు ఆగిపోతే మళ్లీ మొదలు పెట్టడానికి సమయం పడుతుందని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. కర్మాగారానికి ముడిసరుకు తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కార్మికులు అనుమానం కారణంతోనే విధులను బహిష్కరించడంపై వారు విచారం వ్యక్తం చేశారు.

సమస్యలను పరిష్కరిస్తా..



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భోగాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి హామీ ఇచ్చారు. బుధవారం భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రహదారులు, కాలువలు, భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని సమస్యలను ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వందనాల రమణ, పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



అర్జీలు స్వీకరిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. కార్యకర్తే అధినేత కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే నిధి అన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, వలిరెడ్డి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన నాయకులతో పురందేశ్వరి, వీర్రాజు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు వైసీపీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోడసింగి నారాయణరావు, రాజాం తృప్తి రిసార్ట్సు ఎండీ పీవీజీ కృష్ణంరాజు, వై.స్మిత వారి అనుచరులతో బీజేపీలో చేరారు. బుధవారం రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు సమక్షంలో వారు చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్లమెంట్ కన్వీనరు లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో వారు పార్టీ కండువాలు వేసుకున్నారు.

రాజాంలో అభివృద్ధి పరుగులు

రాజాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాతనే రాజాం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ సీనియర్ నేత కోండ్రు జగదీశ్ అన్నారు. బుధవారం మండలంలో ఒమ్మి, దోసరి గ్రామాలలో జరిగిన గ్రామదేవత ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా కోండ్రు మురళీమోహన్ గెలుపొందిన తర్వాత రాజాంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయుకులు వంగా వెంకటరావు, నాగళ్ల అప్పలనాయుడు, మాడుగుల జయరాం, మద్దు హరి, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు



మంత్రి నారాయణను సత్కరిస్తున్న ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను క్రెడాయ్ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తి రంగాన్ని ప్రభావితం చేసే పలు కీలక అంశాలపై ప్రతినిధులు మంత్రితో చర్చించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కేఎస్‌సీ బోస్ మాట్లాడుతూ ఎత్తైన భవనాలకు ఆంక్షలు సడలించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెగ్యులర్ లేఅవుట్ రెగ్యులరేజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులకు కన్వర్షన్ చార్జీలకు రాయితీ కల్పించాలన్నారు. గెడ్డ, గోర్జ భూములకు బఫర్ జోన్ సడలింపు చేయాలన్నారు. పెండింగ్‌లోని టీడీఆర్‌లను త్వరితగతిన విడుదల చేయాలన్నారు. అలాగే చిన్న సైట్ల విషయంలో బాల్కనీలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు సీహెచ్.సూర్యనారాయణరాజు, ఎంవీ రమణ, బి.సత్యనారాయణ, ఎ.నాగేశ్వరావు, పి.సురేంద్ర, అశ్వంత్, నితిన్, నారాయణం శేఖర్, స్వామినాథ్, శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కృషి చేస్తా



పూజల్లో ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అవసరమైన భవనాల నిర్మాణానికి నిధుల కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం కళాశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె.. కెమిస్ట్రీ అధ్యాపకుడు కృష్ణారెడ్డి, రాజేశ్వరి దంపతులతో కలసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఇంటర్మీడియట్ పరీక్షలో టాపర్స్‌గా నిలిచిన వారికి మెరిట్ సర్టిఫికెట్‌లను అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమశంకరరావు, నాయకులు గొరపల్లి రాము, సూరిబాబు, ఎల్లపు సూరిబాబు, చిన్నీ ఉన్నారు.

పదోన్నతులు కల్పించండి

వేపాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు కల్పించాలని ఎమ్మెల్యే లలిత కుమారికి గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆమె నివాసంలో వారు కలిశారు. విధుల్లో చేరి ఐదున్నరేళ్లు కావస్తున్నా ఏఒక్కరికి పదోన్నతులు కల్పించకపోవడం శోచనీయమన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల వెల్ఫేర్‌ల సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్, నారాయణదాసు, కృష్ణ, సత్యవేణి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో 'రోబోతాన్'



దర్వేకర్‌ను సత్కరిస్తున్న వీసీ

నెల్లిమర్ల, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం రోబోతాన్ 2కె25 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాయత్రి విద్యా పరిషత్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ కె.దర్వేకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు సంబంధించిన కోర్సులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రాజెక్టుల రూపకల్పనను ప్రశంసించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రశాంత్‌కుమార్ మొహంతి.. దర్వేకర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్‌వీఎస్‌కు దీపక్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించారు. డీన్ డాక్టర్ సన్నిడి యోల్, ప్రొఫెసర్ పీఎస్‌వీ రమణారావు, ప్రొఫెసర్ శ్రీనివాసరావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బైపీసీ విద్యార్థులకు సువర్ణావకాశం

శ్రీకాకుళం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బైపీసీ 2024-25లో పూర్తిచేసిన విద్యార్థులకు బీఎస్సీ పారా మెడికల్, నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన ప్రతికా ప్రకటన విడుదల చేశారు. కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి, ఫీజును జీతం నుంచి మినహాయిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19న సాయంత్రం 3 గంటల్లోగా రాగోలులోని జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9121999654, 7680945357, 7995013422 నెంబర్లను సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

చర్చించకపోవడం బాధాకరం

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): మూతపడిన సహకార చక్కెర ఫ్యాక్టరీలపై సీఎం చంద్రబాబు క్యాబినెట్ సమావేశంలో చర్చించకపోవడం బాధాకరమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బుధవారం జిల్లా పా ర్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. క్యాబినేట్ సమావేశంలో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలపై చర్చ జరుగుతుందని ఆశపడిన రాష్ట్రవ్యాప్తంగా రైతులు, కార్మికులు, ఉద్యోగులు అసంతృప్తి చెందుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో మూతపడ్డ ఉత్తరాంధ్రలో కీలకమైన తాం డవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి చక్కెర ఫ్యాక్టరీ లను తెరిపిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ గళం పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ౦. సమా వేశంలో గోపాలరావు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహారాన్ని అందించడం, అవసరమైర మందులను సరఫరా చేయడం, సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నది మనందరి లక్ష్యమని కావాలని కలెక్టర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో (పోషణ్ పక్వాడా) భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో యాన మాట్లాడారు. బాలబాలికల ఆర్యోగంపై అన్ని శాఖలు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయడం, తల్లులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం తదితర చర్యలను చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సుమారు 69 వేల మంది చిన్నారుల్లో, బరువు తక్కువగా ఉన్నవారు దాదాపు 4 వేల మంది ఉన్నారన్నారు. వీరికి పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే జిల్లాలో సుమారు 7 వేల మంది మరుగుజ్జు పిల్లలు ఉన్నారని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా ఎక్కువని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి గల కారణాలను అన్వేషించా లన్నారు. అలాగే జిల్లాలో చిన్న వయస్సులో గర్భం దాలుస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, దాని నివారణకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలోని ఐసీడీఎస్ పీడీ రూక్సాన్ బేగం, డీఈవో మాణిక్యంనాయుడు, డీఎంహెచ్‌వో జీవనరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత తదితరులు ఉన్నారు.

పెళ్లి ఇష్టం లేక..

● పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



కృపారావు (ఫైల్)

జామి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేట గ్రామానికి చెందిన ఒక యువకుడు తల్లిదండ్రులను భయపెట్టాలని బుధవారం పురుగు మందు తాగాడు. దాంతో ఆ యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నంరాజుపేటకు చెందిన జలగడుల కృపారావు(26)ను కొద్దినెలలుగా తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తున్నారు. సంబంధాలు కూడా చూస్తున్నారు. పెళ్లి ఇప్పుడే వద్దని చెప్పిన వారు వినలేదు. దీంతో కృపారావు ఈనెల 14న ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో తల్లిదండ్రులను భయపెట్టి పెళ్లిగోల తప్పించుకోవాలని పురుగు మందు తాగాడు. వెంటనే విషయం గుర్తించిన తల్లిదండ్రులు విజయనగరంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతితో తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయరు. మృతుడి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మారికవలసలో గరివిడి విద్యార్థి..



కార్తీకేయ (ఫైల్)

గరివిడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీపీ కాలనీ (బద్దెప్రసాద్ కాలనీ)కి చెందిన విద్యార్థి తీడ వేదాంత కార్తికేయ (16) మంగళవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కార్తీకేయను ఐదు రోజుల కిందట విశాఖ జిల్లా మారికవలసలోని ఓజాన్ వ్యాలీలో ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో తల్లిదండ్రులు అచ్యుతరావు, పార్వతి జాయిన్ చేశారు. బుధవారం ఉదయం కళాశాల హాస్టల్ గదిలో కార్తికేయ ఉరి వేసుకుని ఉండటాన్ని కళాశాల సిబ్బంది గమనించి దగ్గర టలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కార్తీకేయ మృతి చెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. కార్తికేయ గరివిడిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదోతరగతి చదివాడు. పరీక్ష ఫలితాలు ఇంకా రాలేదు. నెమ్మదస్తుడిగా, చదువులో చురుగ్గా ఉండే కార్తికేయ ఆత్మహత్య పాల్పడటాన్ని తోటి విద్యార్థులు, స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డెంకాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొల్లంగిపేట జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ఎన్‌జీఆర్ పురం గ్రామానికి చెందిన జంగిలి రామప్పడు (54) మృతి చెందినట్టు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామప్పడు తన భార్య మహలక్ష్మితో తన కుమార్తె పెండ్లి పిలుపు నిమిత్తం గ్రామం నుంచి గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామానికి వెళ్లే సమయంలో చల్లంగిపేట జంక్షన్ వద్ద తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి గొయ్యిలో పడిపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఘటనా స్థలం వద్ద రామప్పడు మృతి చెందగా, మహలక్ష్మి తీవ్ర గాయాలపాలైందన్నారు. ఘటనపై డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ..

గరుగుబిల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రావివలస సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడిన ఓ మహిళ గాయాలపాలై.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై గరుగుబిల్లి హెడ్ కానిస్టేబుల్ ఎన్.ఈశ్వరరావు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం కుప్పిలి వీధికి చెందిన సవలాపురపు కొండమ్మ(50) తన భర్త సంజీవితో కలిసి ఈనెల 14న ద్విచక్ర వాహనంపై పార్వతీపురం మండలం గోపాలపురం వెళ్లారు. 15న తిరిగి వస్తుండగా గరుగుబిల్లి మండలం రావివలస సమీపంలో కొండమ్మ ద్విచక్ర వాహనంపై నుంచి జారి కిందకు పడింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి రేజేటి పైడిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో వ్యక్తికి ఆరునెలల జైలు

గరివిడి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో దుమ్మెద, వెదుళ్లవలస, కొండలక్ష్మీపురం గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడిన పున్నాన రాంబాబుకు ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ చీపురుపల్లి మున్సిఫ్ న్యాయాధికారి వై.ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు చురుగ్గా చేపట్టి దోషికి శిక్ష పడేలా సాక్ష్యాలను సకాలంలో న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టినందుకు గరివిడి ఎస్ఐ పి.లోకేశ్వరరావు, కానిస్టేబుల్ జి.ఎల్.నాయుడులను చీపురుపల్లి న్యాయాధికారి అభినందించారు.

ఎస్ఐపై దాడి కేసులో యువకుడి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ

రాజాం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాజాం రూరల్ సర్కిల్ పరిధిలోని సంతకవిటి ఎస్ఐ గోపాలరావుపై దాడిచేసి, అతడి మెడలోని బంగారు చైన్‌ను తెంచుకెళ్లిన ఘటనలో ఓ యువకుడిని బుధవారం అరెస్టు చేశామని రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. సంతకవిటి మండలం జావాంలో ఈనెల 13న జరిగిన జాతరలో జావాం, మద్దూరు శంకరపేట గ్రామాలకు చెందిన యువకుల మధ్య చోటు చేసుకున్న వివాదం కొట్లాటకు దారి తీసిందన్నారు. విషయం తెలుసుకున్న సంతకవిటి ఎస్ఐ గోపాలరావు తన సిబ్బందితో కలిసి ఇరువర్గాలను చెదరగొట్టారన్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న మద్దూరు శంకరపేటకు చెందిన యడ్ల రమణ ఎస్ఐ గోపాలరావు జావాం యువకులకు అనుకూలంగా వ్యవహరించారని భావించి వెనుక నుంచి ఎస్ఐను గాయపడేలా కొట్టి, నేలపై తోసేసి, మెడలోని రెండు తులాల బంగారు చైన్‌ను తెంచి పరారయ్యాడన్నారు. రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎస్ఐ గోపాలరావు సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు అనంతరం ఎస్ఐ గోపాలరావు, ఏఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది కృష్ణ, ప్రసాద్ గాలింపు చర్యలు చేపట్టారన్నారు. మద్దూరు శంకరపేట సమీపంలో యడ్ల రమణ పట్టుబడ్డాడన్నారు. నిందితు డి నుంచి చైన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజాం కోర్టులో బుధ వారం ప్రవేశపెట్టగా రమణకు 14 రోజులరిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

గజపతినగరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డు పోరాపు రామసత్యం బైక్‌పై జంక్షన్ దాటుతుండగా అనకాపల్లికి చెందిన వడ్డెడ లిఖిత్, పిల్లా సాయికుమార్ సాలూరు వెళ్తూ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టారు. దాంతో రామసత్యంతో పాటు ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

కెంగువ డీలర్‌పై విచారణ

గజపతినగరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంగువ రేషన్ డీలర్ కొండల ఆనందరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు నివేదిక అందజేశామని సీఎస్ డీటీ తిరుపతిరావు తెలిపారు. మూడు నెలలుగా సక్రమంగా రేషన్ సరుకులు అందజేయడం లేదని రేషన్ కార్డుదారులు తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సీఎస్ డీటీ బుధవారం విచారణ చేపట్టారు. రేషన్ దుకాణాన్ని పరిశీలించగా 661 కేజీల బియ్యం, 40 ప్యాకెట్ల పంచదార తక్కువ ఉన్నట్టు గుర్తించామన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు

రేగిడి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ జైభీమ్ హెచ్చరించారు. బుధవారం రాత్రి మండలంలోని మీసాల డోలపేటలో సారా నివారణపై అవగాహన కల్పించారు. రవాణా, అమ్మకాల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 14405కు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.మాన్యాలు పాల్గొన్నారు.

అయోధ్యకు బొబ్బిలి వీణ



వీణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బొబ్బిలి వీణను అయోధ్యలోని శ్రీరామ మందిరానికి బహూకరించనున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. గొల్లపల్లి వీణల తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అయోధ్య కోసం తయారవుతున్న వీణను పరిశీలించారు. వీణ తయారీ దాదాపు పూర్తి కావస్తోందని, అన్ని రకాల హంగులు, సొగసులు అద్ది తుదిరూపం ఇస్తామని కళాకారులు ఆయనకు వివరించారు. ఈ నెలాఖరులోగా అందజేస్తామని అన్నారు.

పౌల్ట్రీ కార్మికుల పాదయాత్ర

చీపురుపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కర్లాంలోని వెంకటరామా కోళ్ల పరిశ్రమ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సామూహిక రాయబారం పేరిట బుధవారం పాదయాత్ర చేశారు. కర్లాంలోని పౌల్ట్రీ నుంచి పాదయాత్రగా చీపురుపల్లి చేరుకుని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టీవీ రమణ, సీఐటీయూ నాయకుడు అంబల్ల గౌరినాయుడు, కార్మిక సంఘ ప్రతినిధులు గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ, పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు సీహెచ్ సూరిబాబు, ఎం.మురళి డిమాండ్ చేశారు. బుధవారం యూత్ హాస్టల్‌లో జిల్లా అధ్యక్షుడు జోగారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. బదిలీలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు, ఎల్ఎఫ్ఎల్, హెచ్‌ఎంలతో నింపాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు స్వామి, రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు టోల్ ఫ్రీ నెం.1912

గంట్యాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులు ఫోరం అధ్యక్షుడు, విశ్రాంత న్యాయాధికారి బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీజీఆర్ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలోని కమిటీ సభ్యులు సుబ్బారావు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఏఈ శ్రీనివాసరావు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిని సస్పెండ్ చేసేందుకు వెనుకాడబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం 36వ డివిజన్, 43వ సచివాలయం పరిధిలో ఆయన పర్యటించారు. పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణలో కొన్ని లోపాలను గుర్తించారు. వాటిని సరి చేసుకోవాలని ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. లేని పక్షంలో సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన పబ్లిక్ హెల్త్ వర్కర్‌ను విధుల నుంచి తాత్కాలికంగా కమిషనర్ సస్పెండ్ చేశారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. బుధవారం కమిషనర్ ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు నెల్లిమర్ల చంపావతి నది వద్ద ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ వద్దకు వెళ్లి నీటిమట్టాన్ని గమనించారు. ఆండ్ర నుంచి వచ్చిన నీరు ఎంతమేరకు నగర ప్రజలకు నీటి పంపిణీకి సరిపోతుందో అంచనా వేశారు. ఇంకా ఎన్ని టీఎంసీలు నీరు అవసరమనే వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు అవసరమైన నీటి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఆండ్ర నుంచి నీటిని విడుదల చేశామని, దీనివల్ల నెల రోజుల వరకూ ప్రజలకు అవసరమైన నీటి లభ్యత ఉందన్నారు. అప్పటికీ వర్షాలు కురవని పరిస్థితుల్లో మరోసారి ఆండ్ర నుంచి నీటిని విడుదల చేయించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాసరావు, ప్రసాద్, ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

రాజాం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్ కవర్లు ఎవరు వినియోగించినా చర్యలు తప్పవని గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని మున్సిపాలటీ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో గుడ్డ సంచులను పర్యావరణ సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి పాలిథిన్ నిషేధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ప్రసాద్. రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కు మార్, పెంకి చైతన్యకుమార్, అచ్యుత్‌కుమార్, సీమకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

రామభద్రపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు మండలంలోని లబ్ధిదారులు మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రత్నం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి మండలానికి 11 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. పారిశ్రామిక, రవాణా రంగానికి ప్రాధాన్యత ఇచ్చి ఆయా రంగాల్లో ప్రావీణ్యత ఉన్న అభ్యర్థులు ఐఎస్‌బి సెక్టార్ టైప్ 1, 2, అలాగే ట్రాన్స్‌పోర్ట్ టైప్ 1, 2లలో అభ్యర్థి ప్రావీణ్యత మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో రంగంలో సుమారు రూ.3లక్షల రుణం మంజూరవుతుందని చెప్పారు. దీనిలో 40 శాతం రాయితీ కాగా 55 శాతం బ్యాంకు రుణంగా ఉంటుందని, మిగిలిన 5 శాతం లబ్ధిదారులు మార్జిన్ మనీగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పారాది గ్రామ శివారు వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆర్డీవో రామ్మోహనరావు గుర్తించి, పట్టుకున్నారు. బుధవారం విజయనగరం వెళ్తున్న ఆయన దారిలో ఈ ట్రాక్టర్లను గుర్తించి, నిలుపుదల చేశారు. వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆయన పట్టుకుని, తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ సూచన మేరకు స్థానిక వీఆర్వో వాటిని స్వాధీనం చేసుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కందుకూరికి నివాళి



కందుకూరికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట గొప్ప సంఘ సంస్కర్తగా కందుకూరి వీరేశలింగం పంతులు పేరుగడించారని జిల్లా రోటరీ చైర్మన్ జేసీ రాజు అన్నారు. కందుకూరి జయంతి సందర్భంగా బుధవారం స్థానిక రోటరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రోటరీ ప్రతినిధులు శ్రీహరి, శివకాంత్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల వేళ స్వీయ రక్షణే కీలకం

- డీపీఎం రాజేశ్వరి
- మాక్‌డ్రిల్ చేసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

భోగాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తు ల సమయంలో సహాయక బృందాలు వచ్చేలోగా తమను తాము రక్షించుకోవడం ఎలాగో ప్రజలు తెలుసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజేశ్వరి అన్నారు. చేపలకంచేరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆర్ఐ చంద్రశేఖర్ నేతృత్వంలో భూకంపాలు, ప్రకృతి విపత్తులపై బుధవా రం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ ప్రజలు తమతో పాటు ఆస్తులను ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు మాక్ డ్రిల్ చేసి.. చూపించారు. భూకంపం వచ్చినప్పుడు భవనాల్లో చిక్కుకున్న వారిని రక్షించడం.. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడం... ఆసుపత్రులకు తరలించడం, అగ్ని ప్రమాద సమయాల్లో చేపట్టే సహాయక చర్యలు.. తదితర అంశాలపై మాక్‌డ్రిల్ చేశారు. 17 శాఖలకు చెందిన అధికారులు శాఖాపరమైన ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి రాంప్రకాష్, తహసీల్దార్ ఎం.సురేష్, సీఐ ఎస్వీ ప్రభాకర్, విపత్తుల శాఖ పర్యవేక్షకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆ 47 ఎకరాలు ఏమైనట్లో?

(ఐదో పేజీ తరువాయి)

అప్పట్లో గుర్తించిన 41 ఎకరాల నుంచి శిస్తును సక్రమంగా వసూలు చేయడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

వేతనాలకు నోచని అర్చకులు..

చెన్నకేశవస్వామి ఆలయాన్ని ఏడాదికి ఒక అర్చక కుటుంబం చూస్తోంది. ఈ ఏడాది పేరంబదూర్ తేజావతి కుటుంబం నిర్వహిస్తోంది. అయితే గడిచిన నాలుగేళ్లుగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న తమ కుటుంబానికి ఒక్కరూపాయి జీతం ఇవ్వలేదని తేజోవతి వాపోయారు. జీతాల విషయంపై విజయవాడ వెళ్లి కమిషనర్‌కు మొరపెట్టుకున్నా మార్పులేదని, జిల్లా అధికారులూ పట్టించుకోలేదని, స్థానిక ఈవోలను అడిగితే రిపోర్టులు రాస్తాం జీతం అకౌంట్‌లో పడుతుందని చెప్పుకొస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

● చెన్న కేశవస్వామి ఆలయ భూముల విషయంపై ఆలయ ఈవో ప్రసాదరావు వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, అవగాహన లేదని అన్నారు. త్వరలోనే సర్వే చేసి అన్యాక్రాంతంలో ఉన్న 47 ఎకరాలను గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆలయ అర్చకుల జీతాల అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆ భవనాల్లో భద్రత ఉందా?

(ఐదో పేజీ తరువాయి)

ప్రవేశాల సంఖ్య ఆధారంగా జూనియర్ కాలేజీలకు అనుమతి ఉంటుంది. అదే సమయంలో ప్రవేశాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలి. ఇదెక్కడా పాటిస్తున్న దాఖలాలు లేవు.

● ఒక గదికి 40 మందికి మించి విద్యార్థులు ఉండకూడదు. ప్రతి గదిలో వెంటిలేషన్ ఉండాలి. అగ్నిప్రమాదం లాంటి విపత్తుల సమయంలో క్షేమంగా బయటకు తరలించేందుకు వీలుగా కిటికీలు, ద్వారాలు ఉండాలి. కాలేజీకి వచ్చే మార్గం విశాలంగా ఉండాలి. మరో మార్గం గుండా బయటకు వెళ్లాలి. కానీ దాదాపు అన్ని కాలేజీల్లో ఇన్‌గేట్, అవుట్ గేటు ఒక్కటే ఉంటున్నాయి. అగ్నిప్రమాదం సంభవిస్తే సులువుగా బయటపడేందుకు ముందస్తు ఏర్పాట్లు ఉండాలి. ట్యాంకర్లను అమర్చాలి. చాలా కాలేజీల్లో అవి కనిపించడం లేదు. అధిక ఫీజులు వసూలు చేస్తూ లాభాపేక్షతోనే నడిపిస్తున్నాయి. విద్యార్థుల రక్షణను గాలికొదిలేస్తున్నాయి. ఒకటి, రెండు విద్యా సంస్థలే ఫైర్‌సేఫ్టీ, ఇతర భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నాయి.

తనిఖీల ఊసే లేదు

వాస్తవానికి ప్రతి జూనియర్ కాలేజీని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారులు తనిఖీ చేయాలి. అగ్నిమాపక సిబ్బంది కూడా తనిఖీ చేసి సంబంధిత యాజమాన్యాలకు కీలక సూచనలు ఇవ్వాలి. నిబంధనలు పాటించని వారికి నోటీసులు అందించాలి. అవసరం అనుకుంటే కేసులు కూడా నమోదుచేయాలి. విజయనగరంలో చాలా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ఇరుకు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కాలేజీల నిర్వహణకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలా అనుమతులిచ్చారో తెలియడం లేదు. అధికారులు మామూళ్ల మత్తులో పడి ఇలా ఇబ్బడిముబ్బడిగా అనుమతులిచ్చారన్న విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ కాలేజీలు భేష్

ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలతో పోల్చుకుంటే ప్రభుత్వ విద్యాసంస్థలు భవనాల పరంగా నిబంధనలు పాటిస్తున్నాయి. దాదాపు అన్ని కాలేజీలకు సొంత భవనాలు ఉన్నాయి. గ్రామాలకు, పట్టణాలకు దూరంగా సువిశాల ప్రాంగణంలో నడుస్తున్నాయి. గతంతో పోల్చుకుంటే ఉత్తీర్ణతను పెంచుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 32, కేజీబీవీలు ఆదర్శ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన కళాశాలలు 71 ఉన్నాయి. ఇటీవల విడదలైన ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీలు, మోడల్ కళాశాలలు మంచి ఉత్తీర్ణతను సాధించాయి.

మొక్కుబడిగా సీవోటీ సిలిండర్లు

జిల్లాలోని అనేక విద్యాసంస్థలు నిబంధనలకు పాతర వేశాయి. కొన్నిచోట్ల నామమాత్రంగా సీవోటీ సిలిండర్‌లు పెట్టారు. అవి కేవలం అలంకారప్రాయమే. ఫైర్, విద్యుత్ ప్రమాదాలు జరిగితే పనిచేయవు. ఒకే మెట్ల మార్గంలో విద్యార్థులు వెళ్లి రావాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తొక్కిసలాటకు అవకాశం ఉండొచ్చు. కానీ ఏ సంస్థా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు.

\- ఆదినారాయణ, విద్యార్థి తండ్రి

భద్రతను పట్టించుకోకుంటే చర్యలు

జిల్లాలో ప్రతి ప్రైవేటు జూనియర్ కాలేజీలో అగ్నిమాపక శాఖ అధికారులు ఇచ్చిన ధ్రువ పత్రాలు ఉన్నాయి. ఫైర్ సేఫ్టీ పరికరాలు కూడా ఉన్నాయి. లేకపోతే చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల చదువుకు అనువుగా తరగతి గదులు ఉండాలి.

\- మజ్జి ఆదినారాయణ, ఆర్ఐవో

24 గంటలూ వైద్యం అందుతోందా?

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రంలోని ఆసుపత్రితో పాటు రాజాం మండలం బొద్దాం పీహెచ్‌సీలకు అత్యవసర వైద్యం కోసం వెళ్లే వారికి నిరాశే ఎదురవుతోంది. పాము, కుక్కకాటు, రోడ్డు ప్రమాద బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులను పలకరించడానికి నైట్ వాచ్‌మెన్లు సైతం కనిపించడం లేదు. పీహెచ్‌సీల తీరుపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏజెన్సీలోని 30 పీహెచ్‌సీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మధ్యాహ్నానికి కొంతమంది వైద్యులు, సిబ్బంది ఇంటిముఖం పడుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.

స్థానికంగా ఉండడం లేదు

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది స్థానికంగా నివాసముండాలని ఒకవైపు ప్రభుత్వం చెబుతోంది కాని ఈ నిబంధన ఎక్కడా అమలుకావడం లేదు. ఎక్కువ మంది సుదూర ప్రాంతాల్లోని పట్టణాలు, మండల కేంద్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సబ్ సెంటర్లలో పనిచేసే ఉద్యోగులు కనీస సమయపాలన పాటించడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి పీహెచ్‌లకు వెళ్లి అక్కడ నుంచి వ్యాధి నిరోధక టీకాలు, సామగ్రిని సబ్ సెంటర్లకు తీసుకెళ్లేటప్పటికి మధ్యాహ్నం 12 దాటుతోంది. మరోవైపు ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది ఎక్కువ మంది డిప్యూటేషన్లపై గడుపుతున్నారు. అవసరాన్ని ఆసరాగా చేసుకొని జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లో విధులు మార్పు చేసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉంటు న్నాయి. రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పీహెచ్‌సీలపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

భూ వివాదాలపై చర్యలు తీసుకోండి

- సీపీఐ నాయకుల డిమాండ్

బొబ్బిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు ముదిరి హత్యా రాజకీయాలకు దారి తీస్తున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.శంకర రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామభద్రపురం మండల కేంద్రంతో పాటు కొట్టక్కి, తారాపురం, కొండకెంగువ, గొల్లలపేట, నరసాపురం, రొంపల్లివలస తదితర గ్రామాలలో ప్రభుత్వ భూములను పెత్తందారులు కబ్జా చేసి అనుభవిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములకు సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సమగ్ర సమాచారం ఉంటుందని, దాని ప్రకారం ఆ భూములను ప్రభుత్వ అవసరాలకు ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కన్వీనరు ఎస్.గోపాలం పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు నిర్వహించండి

బొబ్బిలి నియోజకవర్గ ప్రాంతంలో భూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. బొడ్డవలస, గోపాలరాయుడిపేట, నారాయణప్పవలస, కాశిందొరవలస, రామన్నదొరవలస తదితర గ్రామాలలో ప్రభుత్వ, ఫారెస్ట్ భూములు పెద్దఎత్తున కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. వాటన్నిటిపైన అధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జిల్లా న్యాయాధికారికి ఘనంగా వీడ్కోలు



న్యాయాధికారికి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా న్యాయాధికారిగా పనిచేసి గుంటూరు జిల్లా న్యాయాధికారిగా బదిలీ అయి వెళ్తున్న బి.సాయి కళ్యాణచక్రవర్తిని బుధవారం బొబ్బిలి కోర్టులో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయాధికారిగా పని చేసిన అనుభవం తనకు చాలా తృప్తినిచ్చిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన మురళీకుమార్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులంతా ఆయన్ని సత్కరించారు. బొబ్బిలి కోర్టు భవనాల సముదా యం కోసం రూ.34 కోట్ల నిధులను మంజూ రు చేయించడంలో సాయి కళ్యాణచక్రవర్తి చాలా కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎస్ న్యాయాధికారి దామోదర్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.అరుణశ్రీ, ఏజేఎఫ్‌సీఎం ఎం.రోహిణిరావు సీనియర్ న్యాయవాదులు మత్స బెనర్జీ, అమ రాపు రామకృష్ణ, కొల్లి సింహాచలం, ఎం.సింహాచలం, గంటి శర్మ పాల్గొన్నారు.

మద్యం, సారా పారబోత



సారాను పారబోస్తున్న దృశ్యం

రామభద్రపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో బుధవారం 676 క్వార్టర్ మద్యం సీసాలు, 79 లీటర్ల సారాను పారబోశారు. గత కొన్ని సంవత్సరాలుగా స్టేషన్‌లో నిల్వఉన్న ఈ మద్యం సీసాలను, సారాను జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్ దొర ఆధ్వర్యంలో వీటిని ఒక గొయ్యి తీసి అందులో పారబోశారు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు, ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏఎస్ దొర హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆయన విలేకర్లతో మాట్లాడారు. మార్చి నెలలో 490 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 173 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా దాడులు చేస్తున్నామని తెలిపారు. నవోదయం పథకం ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేస్తున్నామన్నారు. జిల్లాలో 169 మద్యంషాపులు ఉన్నాయని, షాపుల ద్వారా బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి

బాడంగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు సుమారు 6 నుంచి 15 నెలల వరకు జీతాలు బకాయి ఉంచడం చాలా అన్యాయమన్నారు. పది నెలల జీతాలు బకాయి ఉంటే రెండు మూడు నెలల జీతాలు బకాయి ఉన్నట్టు చూపించడం చాలా అన్యాయమన్నారు. వెంటనే దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి తప్పకుండా జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

బాడంగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ జీయో ట్యాగింగ్ పూర్తిచేయాలన్నారు. మిస్సింగ్ సిటిజన్ డేటా కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. శతశాతం ఇంటి పన్ను వసూలు చేసి బ్యాంకుకు జమచేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు.

న్యూస్ బాక్స్

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్



పనిచేయని ఆర్వో ప్లాంట్

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పారాది ఎంపీపీ ఆదర్శ పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ గత కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. దీంతో పాఠశాలలో ఉన్న 90 మంది విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై హెచ్‌ఎం కె.అర్జున్‌ను వివరణ కోరగా.. మెకానిక్‌కు చెప్పామని, ఆయన రావడం లేదని, రాగానే ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



వాలిపోయి ఉన్న విద్యుత్ స్తంభం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పారాది ఎంపీపీ ఆదర్శ పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థితిలో వాలిపోయి ఉంది. ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగింపజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యుత్ అధికా రులకు ఫిర్యాదు చేశామని, కానీ ఎటువంటి ప్రతిస్పందన లేదని హెచ్‌ఎం అర్జున్ తెలిపారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

తెర్లాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పెరుమాళి గ్రామంలో ఏర్పాటుచేసిన మినీ వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే బేబీనాయనకు బుధవారం ప్రారంభించారు. గ్రామస్థుల కోరిక మేరకు ఆయన తన సొంత నిధులు సుమారు రూ.2లక్షలు కేటాయించి బోరుతో పాటు వాటర్ ట్యాంకును నిర్మించారు. ఏఎంసీ చైర్మన్ వెంకటనాయుడు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరావు, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి తేజోవతి, నాయకులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేయండి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. మస్టర్ షీట్‌ను తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పనిచేసి, గరిష్ఠ వేతనాన్ని పొందాలని కూలీలకు సూచించారు. పని వద్ద తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఏపీవో లక్ష్మీపతిరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విలేజ్ పార్క్ కోసం స్థల పరిశీలన

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో విలేజ్ పార్క్ ఏర్పాటు కోసం ఉపాధి హామీ ఏపీవో లక్ష్మీపతిరాజు బుధవారం స్థల పరిశీలన చేశారు. బలిజిపేట రోడ్డు పక్కన గల విద్యుత్ సబ్‌స్టేషన్‌కి ఆనుకుని ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి, అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, సర్పంచ్ బి.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేశాయివలస ఎంపీపీ పాఠశాలను ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు బుధవారం సందర్శించారు. హాజరు పట్టీ పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, పలు సూచనలు ఇచ్చారు. హెచ్‌ఎం ధనుంజయరావు పాల్గొన్నారు.